క్లుప్తంగా

మహిళా పోలీసులకు వైద్య శిబిరం



అర్బన్‌హెల్త్ సెంటర్‌లో మహిళలను పరీక్షిస్తున్న వైద్యులు

ఏలూరు రూరల్ : ప్రపంచ మహిళ దినోత్సవం పురస్కరించుకుని గురువారం ఆశ్రం వైద్య కళాశాల యాజమాన్యం మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. ఏలూరు రామచంద్రరావుపేటలో అర్బన్ హెల్త్ సెంటర్‌లో సుమారు 50 మంది సచివాలయం, హోంగార్డు, మహిళ పోలీసులకు వైద్య సేవలు అందించారు. జనరల్ మెడిసిన్, సర్జన్, నేత్ర, గైనకాలజిస్ట్ విభాగంలో వైద్యులు, సిబ్బంది మహిళలకు ఆర్‌బీఎస్, సీరమ్ క్రియాటిన్, హిమోగ్లోబిన్, టిసి, డిసి తదితర పరీక్షలు నిర్వహించారని ఆశ్రం సీఈఓ డాక్టర్ కె హనుమంతురావు తెలిపారు. అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ స్కానింగ్, గర్భాశయ పరీక్షతో పాటు కార్డియాక్ రిలేటెడ్ ఈసీజీ పరీక్షలు చేపట్టామన్నారు.

మృతుడి ఆధారాలు లభ్యం

ఏలూరు టౌన్: ఏలూరు రైల్వేస్టేషన్ పరిధిలోని వట్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని మృతిచెందిన వ్యక్తి పెదపాడు మండలం వీరమ్మకుంట గ్రామానికి చెందిన బోను రంగారావుగా గుర్తించినట్లు ఏలూరు రైల్వే ఎస్ఐ డీ.నర్సింహరావు తెలిపారు. మృతుడు గత కొంత కాలంగా మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో ఇల్లు వదిలి బయట తిరుగుతున్నట్లు బంధువులు తెలిపారని చెప్పారు. వట్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అతను మృతి చెందాడని తెలిపారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ఓ మహిళపై విచక్షణారహితంగా దాడి చేసిన వారిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు మాదేపల్లి రోడ్డు, ఇందిరా కాలనీకి చెందిన లింగబత్తుల నందిని భర్త అచ్చయ్య కొంత కాలం క్రితం మృతి చెందాడు. ఆమె కూలి పనులు చేసుకుంటూ తన ముగ్గురు పిల్లలను పోషించుకుంటుంది. గత కొంత కాలంగా చాటపర్రు గ్రామానికి చెందిన మొద్దు తంబి, మొద్దుసురేష్, మొద్దు నరేష్ ఆమెను వేధిస్తున్నారు. బాధితురాలు ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 3న రాత్రివేళ ఇంటికి వెళ్తున్న నందినిపై ఆ ముగ్గురు దాడి చేశారు. బాధితురాలిని స్థానికులు ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రిలో చేర్పగా వైద్యులు చికిత్స అందించారు. గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళా ప్రముఖులకు నారీశక్తి పురస్కారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వివిధ రంగాల్లో విశేష సేవలు చేస్తున్న ప్రముఖ మహిళలకు నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రతినిధులు నారీశక్తి పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ మార్గాని నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలను జీవితమే నేర్పుతుందని, జీవితంలో ఎప్పుడూ నిరుత్సాహపడకూడదని, వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళల నుంచి ప్రేరణ పొందాలని సూచించారు. నారీశక్తి పురస్కారానికి ఎంపికైన మహిళలు ఆయా రంగాల్లో విధాన నిర్ణయాల్లో చాలా సమర్థవంతమైన పాత్ర పోషిస్తూ నేటి మహిళా శక్తికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, 1వ అదనపు జిల్లా జడ్జి పీ.మంగా కుమారి, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎస్.భవాని, బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఆర్‌పీ నాగరాణి, హోమియోపతి వైద్యురాలు అబ్బూరి అరుణలకు నారీశక్తి అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ డీవీవీ ఫణి కుమార్, ఏఓ ఆర్ వీవీ రాజా, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్‌డీ నసీమా, కల్చరల్ అధికారి పీ. సౌభాగ్యలక్ష్మి దేవి, మహిళా అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబును సన్మానిస్తున్న ఆదిత్య కళాశాల ప్రతినిధులు, విద్యార్థినిలు



మనోహరిని సన్మానిస్తున్న సీఆర్ఆర్ కళాశాల ప్రతినిధులు

సీఆర్ఆర్ మహిళా కళాశాలలో..

స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో గ్రామదీప్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వీ.మనోహరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళలు విద్య, ఉద్యోగం, వివాహం వంటి అంశాల్లో సాధికారికత సాధించాలన్నారు. రాజ్యాంగం మహిళలకు, పురుషులకు సమాన హక్కులు ఇచ్చిందని, ప్రతీ మహిళ తనకు గానీ, తన చుట్టు పక్కల గానీ ఏదైనా అన్యాయం జరిగితే దాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆమెను మహిళా కళాశాల ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీ.శైలజ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలే లక్ష్యం

నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ప్రజలకు మెరుగైన రీతిలో సేవలందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. గురువారం ఏలూరు ఇండోర్ స్టేడియం సమీపంలోని సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ చేసిన సమయంలో సచివాలయంలో సిబ్బంది పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాల్సిన సిబ్బంది సచివాలయంలో ఉండకుండా గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బందికి ప్రత్యేక విధులను అమలు చేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు సచివాలయంలోని ఆయా విభాగాల వారీగా సిబ్బంది క్షేత్రస్థాయిలో తమ పరిధిలోని డివిజన్‌లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకోవాలని వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆయా డివిజన్లల్లో శానిటేషన్ ప్రక్రియ ఏ విధంగా సాగుతుందనేది ఉదయం 5.30 గంటల నుంచి సంబంధిత సచివాలయ సెక్రటరీ తనిఖీలు చేయాలని తెలిపారు. ఏలూరు నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళిక రూపొందించామని నగర కమిషనర్ వెంకట కృష్ణ తెలిపారు. ఉదయం డివిజన్లల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని స్పందన పోర్టల్‌లో పొందుపరచడంతో పాటు వాటి పరిష్కారం చేసి మరోసారి స్పందన పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు వారి పరిధిలోని సమస్యలను తెలుసుకుంటూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కమిషనర్ తెలిపారు.



ఏలూరు ఇండోర్ స్టేడియం సమీపంలోని సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ

కోర్టు ఆదేశాలను అమలుచేయాలి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం భవనం, స్థలం విషయంలో కోర్టు ఆదేశాలను రెవెన్యూ అధికారులు అమలు చేయాలని సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య తదితర నాయకులు కోరారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు కట్లయ్య తదితర నాయకులు మాట్లాడారు. గతంలో ప్రభుత్వం ఏలూరు ఏటిగట్టున జిల్లా రజక సంఘం భవనానికి 17 సెంట్ల స్థలాన్ని కేటాయించిందన్నారు. ఇటీవల రెవెన్యూ యంత్రాంగం అది ప్రభుత్వ భూమి అంటూ సర్వే నెంబరు 39తో నోటీసులు ఇవ్వడంపై ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్‌ను కలిసి వివరించినట్లు తెలిపారు. అప్పటి జిల్లా కలెక్టర్ కుమారస్వామి రెడ్డి హయాంలో ఆ స్థలాన్ని అప్పగించారన్నారు. అనంతరం 2002లో ఈ స్థలం బిల్డింగ్ విషయమై ఏలూరు జిల్లా సివిల్ కోర్టు జిల్లా రజక జనసంఘానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా యువజన కార్యదర్శి వితాల శ్రీనివాస్,జిల్లా రజక నేతలు కొమ్ముంటి మురళీకృష్ణ, కోటిచుక్కల శేషు,కదిలి సుబ్బారావు, లింగాల నాగేశ్వరరావు, చాటపర్రు పండు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిలకలపల్లి కట్లయ్య

అదానీ కుంభకోణంపై విచారణ జరిపించాలి

ఏలూరు (టూటౌన్): అదానీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని వామపక్ష పార్టీల నాయకులు కోరారు. అదానీ కుంభకోణం దేశ ప్రజల సంపదకు ముప్పు అని వామపక్ష పార్టీలు విమర్శించాయి. స్థానిక పవరుపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఐ,సిపిఎం,సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో గురువారం అదానీ కుంభకోణం, బీజేపీ అవినీతిపై జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు చలసాని రామారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ దేశ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా అదానీ కంపెనీల భాగోతం ఉందన్నారు. ఇటీవల మోదీ మతోన్మాద విధానాల బండారాన్ని బీబీసీ డాక్యుమెంటరీ విడుదల చేసిందన్నారు. ఇది ప్రజలకు తెలియనీయకుండా ఉండేందుకు బీజేపీ దానిపై నిషేధం విధించిందని విమర్శించారు. అదానీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని, ఆ గ్రూపులకు కేటాయించిన ప్రభుత్వ రంగ సంస్థల్ని వెనక్కి తీసుకోవాలని, బ్యాంకులకు ఎగ్గొట్టిన రుణాలు తిరిగి కట్టించాలని డిమాండ్ చేశారు. సదస్సులో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు, పి.కిషోర్, బండి వెంకటేశ్వరరావు, డేగా ప్రభాకర్, కాకర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి

నిరాశ్రయులకు అండగా బొరగం ఫౌండేషన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రకృతి వైపరీత్యాలు, ఇతర ప్రమాదాలు సంభవించిన సమయంలో నిరాశ్రయులైన కుటుంబాలకు తమ బొరగం ఫౌండేషన్ అండగా నిలుస్తుందని ఆ ఫౌండేషన్ సీఈఓ బొరగం దుర్గాప్రసాద్ దొర తెలిపారు. ఇటీవల వేలేరుపాడు మండలం కన్నాయిగుట్టలో సంభవించిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన 27 కుటుంబాలను ఆదుకోవడానికి తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయా కుటుంబాలకు వారం రోజులకు సరిపడా నిత్యావసరాలు పంపిణీ చేశామని ఏలూరులో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. అగ్ని ప్రమాదంలో ఇళ్ళన్నీ పూర్తిగా కాలి బూడిదైపోవడంతో 27 కుటుంబాల ప్రజలు కట్టుబట్టలతో మిగలడం అత్యంత విషాదకరమన్నారు. వారికి పక్కా ఇళ్ళు నిర్మించేలా సంబంధిత ప్రజా ప్రతినిధులను కోరతామన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు, సేవాభావం కలిగిన వారు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు వంక నాగరాజు, శ్రీనివాస్ గౌడ్, జడ్పీటీసీ జీ.రామలక్ష్మి, సర్పంచ్ సోడే విజయ, తట్కూరు గొమ్ము సర్పంచ్ కట్టి ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.



కన్నాయిగుట్ట అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న బొరగం ఫౌండేషన్ సీఈఓ దుర్గా ప్రసాద్ దొర

అనుబంధ కమిటీలు పార్టీ విజయానికి కృషి చేయాలి

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీలపై కీలక బాధ్యతను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెట్టారని, రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీ అఖండ విజయానికి కృషి చేయాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. గురువారం ఎంపీ కార్యాలయంలో ఇటీవల నియమితులైన వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు గూడపాటి పవన్‌కుమార్, ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పద్మావతి గిరిబాబు, పంచాయతీ విభాగం జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు పాలడుగు మురళీశ్యాం, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అహ్మద్ రాజాలు ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షులను వైఎస్సార్ సీపీ జెండాలు వేసి అభినందించారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అనుబంధ కమిటీలు మరింత ఉత్సాహంతో పార్టీకి సేవలందించాలన్నారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీలు ఇప్పటి వరకు ఎనలేని సేవలందించాయని, భవిష్యత్తులో కూడా అదే స్ఫూర్తితో పార్టీ విజయానికి తోడ్పాటు అందించాలని ఎంపీ శ్రీధర్ సూచించారు.



ఎంపీ కార్యాలయంలో ఎంపీ శ్రీధర్‌ను కలిసిన పార్టీ అనుబంధ కమిటీల జిల్లా అధ్యక్షులు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	54
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	10
బెండకాయలు	50	కంద	38
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	40
కాకర కాయలు	40-44	కీరా దోస	40
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	58	అల్లం	70
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	44	చుక్కకూర	10
బంగాళదుంపలు	18	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30-48	బఠాణీ	70
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	29
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	16
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	07
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	28
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	30
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	24
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

పెదపాడు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 4న విజయవాడ నగర ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టరు మున్నంగి నాగరాజు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా గురువారం ఏపూరు గ్రామంలో కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీజేపీ చేస్తున్న నమ్మక ద్రోహంపై ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో మార్చి 27న, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో మార్చి 28న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్, ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ బయ్యారపు రాజేశ్వరరావు, ఎంఎస్‌పీ దెందులూరు ఇన్‌చార్జి మద్దాల తిరుపతిరావు, ఎంఎస్‌పీ నాయకులు అయినవర్తి మాధవరావు, పసిరిపోగు బాలరాజు, మాజీ ఎంపీపీ నిమ్మకూరి కిరణ్‌కుమార్, దుడ్డు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పెదపాడు మండలంలోని ఏపూరులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

11న మహిళా ఉపాధ్యాయుల సదస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11న మహిళా ఉపాధ్యాయుల సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీ.రెడ్డిదొర, ఎస్‌కే రంగావలి ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం విద్యా వికాస్ కళాశాలలో ఉదయం 9.30 గంటల నుంచి సదస్సు ప్రారంభమవుతుందన్నారు. ఈ సదస్సులో నేటి సమాజంలో మహిళల పాత్ర, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళల హక్కులు వంటి అంశాలపై వివిధ రంగాల్లో ప్రముఖులైన మహిళా నాయకులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు: మండలంలోని డాక్టరు బీఆర్.అంబేడ్కర్ గురుకులం వట్లూరు నందు 2023-24 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశపరీక్ష ద్వారా 5వతరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డీ మేరీ ఝాన్సీరాణి తెలిపారు. ఆసక్తిగల వారు ఏపీజీపీసెట్ వెబ్‌సైట్ నందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్‌నంబర్లు 73308 41503, 97059 21571 సంప్రదించాలని తెలిపారు.

వీఆర్వోల సంఘం అధ్యక్ష కార్యదర్శులకు సత్కారం

పెదపాడు: ఏలూరు జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్ష కోశాధికారులుగా నియమితులైన వట్లూరు గ్రామ రెవిన్యూ అధికారులు రామానుజం శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు), దామరాజు రవికుమార్‌లను పెదపాడు మండల గ్రామ రెవిన్యూ అధికారులు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవిన్యూ సంఘ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

రైల్వే కన్వెన్షన్‌ను పునరుద్ధరించాలని వినతి

దెందులూరు : కోవిడ్ సమయంలో నిలుపుదల చేసిన రైల్వే కన్వెన్షన్ పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ సంయుక్త కార్యదర్శి కుకునూరి రామచంద్రరావు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. వారి వెంట ఏలూరు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వీ.సన్యాసిరావు, ఏలూరు సంఘ కార్యదర్శి బీ. భాస్కర రావు, అసోసియేషన్ సభ్యులు కావూరి అమ్మేశ్వరరావు, కే. సత్యాజీ రావు, వీ. కిషోర్ కుమార్, సీహెచ్ సీతారామ బ్రహ్మం, సీహెచ్ బాపినీడు చౌదరి ఉన్నారు.

డీఈఓ సలీం బాషాకు సన్మానం

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసి అల్లూరి సీతారామరాజు జిల్లా డీఈఓగా పదోన్నతిపై వెళ్లిన డాక్టర్ సలీం బాషాను గురువారం కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పీడీకేడీ ప్రసాద్ ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందచేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కళాశాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.